సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం : 12 : డిసెంబర్ : 2023



తుపాకీ బుల్లెట్ తగిలే మృతి
రాజాపురం ఘాట్‌లో శ్రీధర్ అనే యువకుడి నాటు తుపాకీ బుల్లెట్ తగలడం వల్లే మృతి చెందాడని ఏఎస్పీ ధీరాజ్ తెలిపారు. 8లో



దీపోత్సవానికి వేళాయె
పద్మనాభంలో మంగళవారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. 8లో



క్రీస్తు బోధనలు ఆచరణీయం
ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యేలు పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

స్పందనకు 42 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో సోమవారం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 42 అర్జీలు స్వీకరించినట్టు ఐటీడీఏ పీవో సురజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించి, మరికొన్ని సమస్యల పరిష్కారాని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. సుమారు 50 ఎకరాల్లో నాటేందుకు శ్రీగంధం మొక్కలు పంపిణీ చేయాలని మారేడుమిల్లి మండలం జీఎంవలస గ్రామాని చెందిన 18 మంది గిరిజనులు కోరారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురైన వారిలో పలువురికి ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ రాలేదని, వారికి ప్యాకేజ్ ఇప్పించాలని బాధితులు అర్జీ అందజేశారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం, బీవీకోటగ్రామాల మధ్యలో నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఇరువైపులా ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పించాలని ఆయా గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రిటైర్డ్ పీడీ ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన భిక్షం

చింతూరు: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక రిటైర్డ్ పీడీ మెండు భిక్షం ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 10 వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 60 ప్లస్ కేటగిరీలో పాల్గొన్న ఆయన డిస్కస్ త్రోలో బంగారు, హేమర్ త్రో, హైజంప్‌లో రెండు సిల్వర్ పతకాలు సాధించారు. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మహారాష్ట్రలోని పూణెలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆయన ఎంపికయ్యారు.

వారం రోజుల్లో చాపరాయి సుందరీకరణ పూర్తి

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



వ్యాపారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతం వద్ద నిర్వహిస్తున్న సుందరీకరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. చాపరాయి జలపాతాన్ని అయన సోమవారం సందర్శించి, రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతం ముందు ప్రహరీ, పర్యాటకులు కూర్చోవడానికి బెంచీలు, దుస్తులు మార్చుకోవడానికి గదులు, పిల్లల కోసం ఆటస్థలం నిర్మిస్తున్నామని చెప్పారు. షాపుల ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్టు చెప్పారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పెదబయలు మండలంలో గల జలపాతానికి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈ అభిషేక్, మూజియం మేనేజర్ మురళీ, పద్మాపురం మేనేజర్ బొంజుబాబు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో పడి గొర్రగేదె మృతి



గొర్రగేదె కళేబరం

మారేడుమిల్లి: వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్ల ఉచ్చులో పడి ఓ గొర్రగేదె మృతి చెందింది. మారేడుమిల్లి–రంప చోడవరం రహదారిలోని టేకు ప్లాంటేషన్ సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు వన్యప్రాణుల కోసం విద్యుత్ వైర్లతో ఉచ్చు అమర్చారు. ఈ ఉచ్చులో పడి గొర్రగేదె మృతి చెందింది. గొర్రగేదె శరీరంలోని సగం మాంసాన్ని వేటగాళ్లు కోసుకొని వెళ్లారు. గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీఎఫ్‌వో నరేంద్రియన్, సబ్ డీఎఫ్‌వో శ్రీవాణి, రేంజర్ అజాత్, సెక్షన్ ఆఫీసర్ సుమంత్ సంఘటన స్థలానికి వెళ్లి గొర్రగేదె కళేబరాన్ని పరిశీలించారు. ఆదివారం మృతి చెందినట్టు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం సంఘటన స్థలంలో ఖననం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిహ్వాచేపల్యం తీరేలా..

చేపల పేరు వింటేనే మాంసాహార ప్రియులు లొట్టలేస్తారు. వీటితో చేసే సంప్రదాయ వంటకాలతో పాటు నోరూరించే తొమ్మిది రకాల ఉత్పత్తులను తయారు చేస్తూ గిరి మహిళలు ఉపాధి పొందుతున్నారు. చేపలు, రొయ్యలతో విలువాధారిత ఉత్పత్తుల తయారీలో కృషి విజ్ఞాన కేంద్రం ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

- చేపలతో తొమ్మిది రకాల ఉత్పత్తుల తయారీ
- కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణతో గిరిజన మహిళలకు ఉపాధి
- మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి



చేపలతో తయారు చేసిన అప్పడాలు



చేపల పచ్చడి



చేపలతో తయారు చేసిన జంతికలు

రంపచోడవరం: గిరిజన మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం విశేష కృషి చేస్తోంది. స్థానిక వనరులతో విలువాధారిత ఉత్పత్తుల తయారీలో మెరుగైన శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగా చేపలు, రొయ్యలతో వివిధ రకాల ఆహార పదార్థాల తయారీలో గిరిజన ఉప ప్రణాళిక నిధులతో 118 మంది శిక్షణ ఇచ్చారు. మూడు బ్యాచ్‌లకు ఇటీవల శిక్షణ పూర్తి చేశారు. ఇప్పటికే శిక్షణ పొందిన పలువురు మహిళలు ఇంటి వద్ద చేపలు, రొయ్యలతో పచ్చళ్లు, ఇతర ఆహార పదార్థాలు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు.

అప్పడాల తయారీ
మినప పిండితో చేపల మాంసాన్ని బాగా కలిపి కారం, ఉప్పు, మసాలాలు వేసుకుని అప్పడాలు తయారు చేయవచ్చు. నిల్వ ఉండేందుకు సోడియాం బేంజోయడ్ కలుపుతారు. బియ్యం పిండిని కలిపి జంతికలు తయారు చేయవచ్చు.

చేపలతో అప్పడాలు, పచ్చళ్లు
చేపల పులుసు లేదంటే చేపల ఇగురు సాధారణంగా తయారు చేసే వంటకాలు. అయితే అందుకు భిన్నంగా కేవీకే ఫిషరీ శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు చేపలతో తొమ్మిది రకాల ఆహార పదార్థాల తయారీలో శిక్షణ ఇచ్చారు. చేపలతో అప్పడాలు, పచ్చళ్లు, సమోస, వడియాలు, ఫిష్ లాలీపప్, చేప ఫిల్లెట్లు, చేప స్టిక్స్, జంతికలు, రొయ్యల పచ్చడి తయారీలో శిక్షణ ఇచ్చారు.

పచ్చడి తయారీ ఇలా..
చేపలను శుభ్రం చేసి మాంసం వేరు చేయాలి. చిన్న, చిన్న ముక్కలు కోసి వేపుకోవాలి. ఉప్పు, కారం, కొద్దిగా ఆవపిండి కలుపు కోవాలి. నిల్వ ఉండేందుకు కొద్దిగా వెనిగర్‌ను వేయాలి.

మార్కెటింగ్‌కు చర్యలు
గిరిజన మహిళలు తయారు చేసిన పదార్థాలను మార్కెటింగ్ చేసేందుకు కేవీకే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏటా వేల సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. కేవీకే అధికారులు ఐటీడీఏ సహకారంతో పర్యాటక ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రంపచోడవరం యూనియన్ బ్యాంకు ప్రాంగణంలో ఉన్న చేయూత మహిళా మార్ట్‌లో ఈ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. చేపలు, రొయ్యల పచ్చళ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, సీతపల్లి, మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాల్లో వీటి స్టాళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త లలితాకామేశ్వరి చెప్పారు.

ఉపయోగకరంగా శిక్షణ



కేవీకే ద్వారా ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇంటి వద్దే ఉండి ఉపాధి పొందవచ్చు. శిక్షణలో చేపలు, రొయ్యలతో పచ్చళ్ల తయారీ, వివిధ రకాల వంటకాలు నేర్చుకున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చళ్లలకు మంచి డిమాండ్ ఉంది.
– కారు నరసయ్యమ్మ, పోక్సుపేట

నెలకు రూ.20వేల ఆదాయం



కేవీకేలో రెండో బ్యాచ్‌లో శిక్షణ పొందాను. చేపలు, రొయ్యలతో నెలకు 60 కిలోల పచ్చళ్లు తయారు చేస్తున్నాను. సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. రూ. 20 వేల ఆదాయం వస్తోంది. మార్కెట్‌లో నిలబడేందుకు మంచి నాణ్యమైన పచ్చళ్లు తయారు చేస్తున్నాం. కేవీకే సహకారంతో స్టాళ్లలో పచ్చళ్లను విక్రయిస్తున్నాం.
–శ్రీదేవి, రంపచోడవరం

సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం మార్కెట్‌లో నాన్‌వేజ్ పచ్చళ్లకు గిరాకీ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేవీకే ఆధ్వర్యంలో చేపలు,రొయ్యలతో పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇచ్చాం. మహిళలు ఇంటి వద్ద పచ్చళ్లు తయారు చేసుకుని మార్కెట్ చేసుకోవచ్చు.
–డాక్టర్ వీరాంజయనేయులు, కేవీకే శాస్త్రవేత్త

గిరిజనుల అభ్యున్నతే సీఎం ధ్యేయం

- ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- మూడు మండలాల్లో గిరిజనులకు డి–ఫారం పట్టాల పంపిణీ



రంపచోడవరంలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

రంపచోడవరం/గంగవరం/అడ్డతీగల: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) అన్నారు. రంపచోడవరంలో 50 మందికి, గంగవరంలో 57 మందికి, అడ్డతీగల మండలం ఎల్లవరంలో 45 మందికి సోమవారం వారు డి -ఫారం పట్టాలు పంపిణీ చేశారు. గంగవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గతంలో డి-పట్టాలు పొందిన 137 మందికి లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు పత్రాలు, ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పొయ్యిలను 70 మంది మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కృషిచేస్తోందన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు పలు సమస్యలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువచ్చారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, నెలిపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు ఏసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌చార్జ్ రఘునాథ్, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు దిండిబాబి, ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, ఎల్లవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, వైఎస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కె.పూజ తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ సన్నిధిలో విశాఖ సీపీ



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, కుటుంబ సభ్యులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని విశాఖ నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకుని, పూజలు చేశారు. తొలిసారిగా పాడేరువచ్చిన సీపీ రవిశంకర్, కుటుంబ సభ్యులకు ఆలయ ప్రాంగణంలో ఘన స్వాగతం లభించింది. మోదమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సీపీ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి, మోదకొండమ్మ చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన
జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, పాడేరు ఏఎస్పీ ధీరజ్ సోమవారం సందర్శించారు. ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- బస్కి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పాడేరు పీవో అభిషేక్

అరకులోయ రూరల్: విధులపట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. మండలంలో బస్కి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం అయన సందర్శించారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు డ్రాపౌట్ ఉన్నారని గుర్తించి ప్రధానోపాధ్యాయుడు డి.వెంకటప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీడీని ఆదేశించారు. విద్యార్థుల డ్రాపౌట్ లేకుండా ఎంపీడీవో, ఏటీడబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించాలని తెలిపారు. అనంతరం కాసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు ఖాళీగా ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెన్త్‌లో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేలా విద్యాబోధన చేయాలని తెలిపారు. 9వ తరగతి విద్యార్థి కిండంగి బలరాంకు ఒక కంటి చూపు సరిగా లేదని గుర్తించి, సదరం సర్టిఫికెట్ జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జమాల్‌బాషాకు ఫోన్‌లో సూచించారు. ఏడవ తరగతి చదువుతున్న బలరాం, బురిడి వంశీ అనే విద్యార్థుల ఆరోగ్యంపై మాడగడ వైద్యాధికారితో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం అరకులోయ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ భవనం మరమ్మతులకు అవసరమైన నిధులు మంజురుచేస్తామన్నారు. జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ కొండలరావు, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నృసింహస్వామి చందన దీక్షలు ప్రారంభం



నృసింహ స్వామి చందన దీక్షల ఏర్పాట్లపై మాట్లాడుతున్న సురేంద్ర బాబు

సాక్షి, పాడేరు: సింహాచలంలో కొలువుదీరిన నృసింహస్వామి చందన దీక్షలను జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు దీక్ష ప్రచారకులు కశిరెడ్డి సురేంద్రబాబు తెలిపారు. పలు ప్రాంతాల్లో చేపట్టిన చందనదీక్ష ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లో చందన దీక్షలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం అధికారుల ఆదేశాలతో సింహాద్రి మఠంలోని నృసింహ స్వామి దీక్ష భక్త బృందం చందన దీక్ష చేయబోయే భక్తులకు మాలధారణ చేస్తుందన్నారు. ఈనెల 12వ తేదీ మంగళవారం ఉదయం 10గంటలకు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయం, చింతపల్లి మండలం జున్నెల గ్రామంలోని రామాలయం, ముంచంగిపుట్టులోని రామాలయం, అరకులోయలోని వేణుగోపాలస్వామి ఆలయంలో చందన దీక్ష మాలాధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మాలధారణ చేసే భక్తులకు మాలలతో పాటు దీక్ష వస్త్రాలను ఉచితంగా పంపిణీ చేసున్నామని, చందన దీక్షపై ఆసక్తి ఉన్న భక్తులు ఎవరైనా ఉంటే నేరుగా పైన పేర్కొన్న ఆలయాలకు ఉదయాన్నే చేరుకోవాలని ఆయన కోరారు.

15న విమ్స్‌లో వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

ఆరిలోవ(విశాఖ): విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో 26 వైద్య పోస్టుల భర్తీకి ఈ నెల 15న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి హనుమంతవాక వద్ద గల విమ్స్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూకు ఉత్తీర్ణత పత్రాలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

ఖాళీలు ఇలా..
విమ్స్‌లో 26 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. అనస్థీషియా విభాగంలో 6 పోస్టులు, న్యూరోసర్జరీ 2, న్యూరాలజీ 2, కార్డియాలజీ 2, సర్జికల్ అంకాలజీ 2, ఎమర్జెన్సీ మెడిసిన్ 2, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్(మెడికల్)లో 2 పోస్టులతో పాటు సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, ఎండోక్రైనాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ట్రాన్సిఫ్యూజన్ మెడిసిన్(పాతాలజీ) విభాగంలో చెరో ఒక్కొక్కటి చొప్పున పోస్టు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.1.60లక్షలు వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

హరహర మహాదేవ



స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- నాలుగో సోమవారం సందర్భంగా పోటెత్తిన భక్తులు



ఉమానీలకంఠేశ్వరస్వామికి అభిషేకాలు జరుపుతున్న అర్చకులు

సాక్షి,పాడేరు: కార్తీకమాసం 4వ సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. పాతపాడేరు, ఐటీడీఏ పీవో బంగ్లా, లగిశపల్లి, వంజంగి, తురాయిమెట్ట, గెడ్డంపుట్టు, తామరాపల్లి ప్రాంతాల్లోని శివాలయాల్లోను భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు అన్న సమారాధనను ప్రారంభించారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల పరిధిలోని సుమారు 7వేల మంది వరకు భక్తులు హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న తమర్బ నరసింగరావు,ఆలయ కమిటీ ప్రతినిధులు

దేదీప్యమానంగా..
అడ్డతీగల: స్థానిక సోమాలమ్మ అమ్మవారి చెంత సోమవారం రాత్రి భారీస్థాయిలో దీపోత్సవం నిర్వహించారు. బాల విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో రెండు వేల ప్రమిదల్లో వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. ఓంకారం, శివలింగం, స్వస్తిక్, ఓం వంటి ఆకృతుల్లో దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు.



శివలింగాకారంలో దీపాలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి...



టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు

గంగవరం: మర్రిపాలెం పంచాయతీ కొమరవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పండా రాజన్నదొర, కుంజం రాజన్న, మిరియాల తమ్మన తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అనంత బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, జెడ్పీటీసీ బేబిరత్నం, ఎంపీటీసీలు గంగాదేవి, కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు,సర్పంచ్‌లు లక్ష్మి, కామరాజు, రామలక్ష్మి, వెంకటేశ్వర్లుదొర పాల్గొన్నారు.

భాషా వలంటీర్ల కొనసాగింపుపై హర్షం

సీఎం, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు

సాక్షి,పాడేరు: భాషా వలంటీర్ల కొనసాగింపు ప్రక్రియకు ప్రభుత్వం న్యాయం చేసింది. రాష్ట్రంలో పలు గిరిజన ప్రాంతాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు పర్యటించిన సమయంలో భాషా వలంటీర్ల కొనసాగింపు అంశంపై గిరిజనుల నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రభుత్వం దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు.ఈ సమస్యను సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిష్కరించారు.రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో 1327 భాషా వలంటీర్లను కొనసాగించడంతో పాటు వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రభు త్వం విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో సవర-13, పార్వతీపురం ఐటీడీఏలో సవర -318, పాడేరు ఐటీడీఏ పరిధిలో కొండ 82, కువి 318, ఆదివాసీ ఒరియా 276, చింతూరు ఐటీడీఏలో కోయ 15, కె.ఆర్.పురం, ఎన్టీఆర్ జిల్లా, వల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య,కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో భాషా వలంటీర్లను కొనసాగించనున్నారు.తమ సమస్యను పరిష్కరించినందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావులకు భాషా వలంటీర్లంతా కృతజ్ఞతలు తెలిపారు.

అనంతుని దీపోత్సవానికి వేళాయె

నేటి సాయంత్రం 5.30 గంటలకు వెలగనున్న దీపాలు

పద్మనాభం: పద్మనాభంలో మంగళవారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. గిరిపైన అనంతుని ఆలయాన్ని, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. దీపోత్సవానికి అవసరమయ్యే 14 డబ్బాల నూనె, ఐదు వేల ఒత్తులు, ఐదు వేల ప్రమిదలు సిద్ధం చేశారు. కుంతీ మాధవస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను మధ్యాహ్నం 3 గంటలకు గరుడ వాహనంపై తీసుకు వచ్చి ప్రథమ పావంచా వద్ద కొలువు దీర్చుతారు. గిరి దిగువన కుంతీ మాధవస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీని నిలువరించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. గిరిపై జే గంట మోగించగానే 5.30 గంటలకు అనంత పద్మనాభస్వామి మెట్లకు కిరు వైపులా భక్తులు ఒక్కసారిగా దీపాలు


ప్రథమ పావంచా వద్ద కొలువు దీరనున్న అనంతుని ఉత్సవ విగ్రహాలు

వెలిగిస్తారు. దీపోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. వీరిలో ముగ్గురు ఏసీపీలు, మహిళా కానిస్టేబుళ్లు 70 మంది ఉన్నారు.

బస్సుల దారి మళ్లింపు

పద్మనాభం మీదుగా సింహాచలం నుంచి విజయనగరం వెళ్లాల్సిన బస్సులను, విజయనగరం నుంచి సింహాచలం వెళ్లాల్సిన బస్సులను మధ్యాహ్నం ఒంటి గంట తరవాత తగరపువలస, ఆనందపురం మీదుగా మళ్లిస్తారు. విజయనగరం నుంచి ప్రత్యేకంగా దీపోత్సవానికి వేసే షటల్ సర్వీసు బస్సులను అర్చకునిపాలెం నుంచి, సింహాచలం నుంచి వేసే షటల్ సర్వీసు బస్సులను పెట్రోల్ బంకు నుంచి వెనుకకు మళ్లిస్తారు.


కొండమెట్లపై ఏర్పాటుచేసిన బారికేడ్లు

పార్కింగ్ ఎక్కడంటే?

తగరపువలస నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులకు స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల వద్ద, విజయనగరం వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులకు అర్చకునిపాలెం రెండో విజయరామరాజు జూనియర్ కళాశాల వద్ద , సింహాచలం నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులను పద్మనాభం గోస్తని వంతెన కింద పార్కింగ్ ఏర్పాటు చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


నిందితులను చూపిస్తున్న పోలీసులు

చింతూరు: ఒడిశా నుండి తెలంగాణకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా, స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తున్న తెలంగాణకు చెందిన వేల్పుల శ్యామ్, గణిపాక సాయికృష్ణలను ఆపి సోదా చేశామన్నారు. వారి వద్ద రూ.12 వేల విలువైన నాలుగు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. ఒడిశాలోని కిందుగూడకు చెందిన కిలో రామచంద్రరావు వద్ద గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హక్కులు, చట్టాల అమలులో నిర్లక్ష్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ముంచంగిపుట్టు: కేంద్ర ప్రభుత్వం మహిళా హక్కులు, చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు.మండల కేంద్రంలో స్థానిక కళ్యాణ మండపంలో సోమవారం గిరిజన మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళాలతో సమావేశం నిర్వహించారు. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల,మహిళ హక్కులు,చట్టాలు ,అమలు తీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల స్వేచ్ఛను కాలరాస్తోందని, మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలు, హక్కులు కచ్చితంగా అమలు చేయాలన్నారు. మండల గిరిజన మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయలక్ష్మి, సర్పంచ్ త్రినాథ్, మహిళ సంఘం సభ్యులు వసుధ,మీనా,రాధమ్మ,అధిక సంఖ్యల్లో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

అనంతగిరి: క్రీస్తుబోధనలు అనుసరణీయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో సోమవారం పీజేసీ చర్చ్‌లో ఏజెన్సీ ఆదరణ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలోని జరిగిన కిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకంలోని ప్రజలందరికీ ప్రేమ, అప్యాయతను నేర్పించారని, ఎదుటివారిని ప్రేమించేగుణం మనలో ఉండాలని, ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలన్నారు. వాక్య సందేశం డేవిడ్‌రాజ్ అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాయి, జెడ్పీటీసీ గంగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ బి.గంగులు, ఉపాధ్యక్షుడు సూర్యానారయణ, ప్రధాన కార్యదర్శి శెట్టిలక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ తౌటినాయుడు, పాస్టర్లు యకోబు, తిమోతి, ప్రేమరాజు, ఉదయ్‌కుమార్, సుబ్లోను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, వేదికపై ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: మండల కేంద్రంలోని లూథరన్ చర్చిలో సోమవారం రాత్రి ఏఎస్ఆర్ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.


దూసరపాము గ్రామంలో క్రిస్మస్ వేడుకలు

ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి, కేక్ కట్ చేశారు. క్రిస్మస్ గ్రీటింగ్స్ చెప్పారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్ బొజ్జయ్య, జిల్లా పాస్టర్స్ కార్యదర్శి చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలోని కల్వరి గ్రేస్ చర్చ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలో పాస్టర్లను ఘనంగా సన్మానించారు. సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు మోజెస్ కిరణ్, సుధాకర్, జెమిని , రాము స్టీఫెన్, శివ, పౌలు, కృపా వర్మ, సతీష్, శ్రీను, నేహేమ్యా పాల్గొన్నారు.

నాటు తుపాకీ బుల్లెట్ తగిలే మృతి

- ఘాట్‌లో ఘటనకు కారకుడి అరెస్టు
- నాటు తుపాకులు స్వచ్ఛందంగా అప్పగించండి
- పాడేరు ఏఎస్పీ ధీరాజ్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ధీరాజ్

పాడేరు రూరల్: పాడేరు–చోడవరం ప్రధాన రహదారి రాజాపురం ఘాట్‌లో ఈ నెల 5న అనుమానాస్పదంగా యువకుడి మృతి చెందిన ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ ధీరాజ్ తెలిపారు. సోమవారం సాయంత్రం పాడేరులో ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం వీరానారాయణం గ్రామానికి చెందిన శరగడం శ్రీధర్(25), పద్రె ఆదిబాబు(30) రాడ్ బైండింగ్, సెంట్రింగ్ పనులు చేస్తుంటారు. నెల రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కించుమండ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ నెల 5న పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఘాట్‌లోని రాజాపురం మలుపు వద్ద పెద్ద శబ్దం రావడంతో వాహనం నడుపుతున్న శ్రీధర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. వెనుక కూర్చున్న అతడి స్నేహితుడు ఆదిబాబు అతడిని స్థానికుల సహాయంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి చేర్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు శ్రీధర్ చెవి పై భాగాన తలకు బలమైన రంధ్రం పడటాన్ని గుర్తించిన ఆదిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి పోస్టుమార్టం నిర్వహించడంతో తల భాగంలో నాటుతుపాకీ బుల్లెట్ ఉండటం గుర్తించారు. దీంతో ఏఎస్పీ ఆదేశాల మేరకు పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐ రంజిత్ ముమ్మర దర్యాప్తు చేపట్టారు. వంట్లమామిడి సర్పంచ్ పాంగి రాంబాబు సహకారంతో పోలీసులు ఈ ఘటనను ఛేదించారు. వంట్లమామిడి పంచాయతీ జోడూరు గ్రామానికి చెందిన కిల్లో సుబ్బారావు(35) ఈ నెల 5న నాటుతుపాకీతో కోతులను వేటాడే క్రమంలో అటువైపు వెళ్తున్న శ్రీధర్‌కు ప్రమాదవశాత్తు నాటుతుపాకీ బుల్లెట్ తగలడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో నిందితుడు సుబ్బారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటుతుపాకీ, నల్లమందు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీలో నాటుతుపాకులను స్వచ్ఛందంగా అప్పగించాలని, లేదంటే తామే స్వయంగా ఇళ్లకు వచ్చి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్ఐ పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను సద్వినియోగం చేసుకోండి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. కించుమండ గ్రామ సచివాలయ పరిధిలో గ్రామస్తులతో సోమవారం ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న యువత సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామస్తుల కోరిక మేరకు పండగకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు, చెల్లమ్మ, నాయకులు బాబురావు ,సంజీవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కించుమండ గ్రామస్తులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

దారాలమ్మ ఘాట్‌లో ద్విచక్రవాహనం బోల్తా

మహిళ మృతి, యువకుడికి తీవ్ర గాయాలు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లో ద్విచక్రవాహనం బోల్తా పడింది. ఈ సంఘటనలో మహిళ మృతి చెందగా, యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మిరేవుల పంచాయతీకి చెందిన మౌనిక, బుసిమాను వీధికి చెందిన బుజ్జిబాబు ద్విచక్ర వాహనంపై దారాలమ్మ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా రెండో మలుపు వద్ద అదుపు తప్పి లోయలో పడింది. ఈ మార్గంలో వెళ్తున్న కొంతమంది చూసి దారకొండ పీహెచ్‌సీకి సమాచారం అందించారు. అప్పటికే మహిళ తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్ర గాయాలైన బుజ్జిబాబును చింతపల్లి ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో అందరితో కలిసిమెలసి తిరిగే మౌనిక మృతి చెందడంతో ఒక్కసారిగా విషాదం అలుముకుంది.


మృతి చెందిన మౌనిక


తీవ్ర గాయాలతో బుజ్జి

చికిత్సకు మొండికేసిన గర్భిణి


గర్భిణి కుటుంబ సభ్యులకు కౌన్సెలంగ్ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లిరూరల్: అధిక రక్తపోటు కలిగిన గర్భిణి ఆస్పత్రిలో ఉండనూ ఇంటికి పంపించేయండి అనే వైనం చింతపల్లిలో సోమవారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆమెను చింతపల్లి ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.అయితే సోమవారం ఉదయం మరలా ఆస్పత్రిలో ఉండని, తమన విడిచిపెట్టాలని గర్భిణి, కుటుంబ సభ్యులు గోడవ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి ఆస్పత్రికి వచ్చి ఆమెకు కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది, ఆఖరికి అధికారులు దారకొండ పీహెచ్‌కి రిఫర్ చేసి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన హరిచంద్రను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

వీఆర్‌పురం: బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలోని తుష్టివారిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. కల్తునూరు గ్రామానికి చెందిన కెచ్చెల హరిచంద్రారెడ్డి పని మీద తుష్టివారిగూడెం గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. అక్కడ అదుపు తప్పి పల్టీకొట్టడంతో అతడి ముఖానికి తీవ్రంగా గాయాలయ్యాయి. అతడిని తొలుత రేఖపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీకి తరలించారు.


15 నుంచి నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ


అనకాపల్లిటౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా మిషన్(సీడప్)లో భాగంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిరుద్యోగ యువతకు ఈ నెల 15 నుంచి నాలుగు మాసాలపాటు వివిధ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారిణి కె.కల్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, శిక్షణ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 89785 33105, 70132 28982 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

కారు ఢీకొని మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివైడర్ దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన బోని పద్మ(38) కార్తిక సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీపురం బాల భాస్కర్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. కార్తిక సోమవారం కావడంతో ఉదయం 5.15 గంటల సమయంలో పద్మ తన వదిన పైడి రాజమ్మతో కలిసి దుర్గగుడికి బయలుదేరింది. కనకదుర్గ ఫ్లైఓవర్ వద్ద డివైడర్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు పద్మను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమై పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. దీనిపై మృతురాలి వదిన పైడి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐఐ యంగ్ ఇండియన్స్ చైర్మన్, కో–చైర్‌పర్సన్ ఎంపిక


హర్షనందన్


శ్రావణి

బీచ్‌రోడ్డు: సీఐఐ యంగ్ ఇండియన్స్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్‌గా హర్ష నందన్, కో చైర్‌పర్సన్‌గా శ్రావణి సంధ్య ఎంపికయ్యారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం చాప్టర్ 15వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐఐ విశాఖపట్నం చైర్మన్ డాక్టర్ పీపీ లాల్ కృష్ణ వీరు ఎంపికైనట్లు ప్రకటించారు. హర్షనందన్ వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్నారు. శ్రావణి ఔరా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ వ్యవస్థాపకురాలు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

నేడు ఆర్గానిక్ వాక్

మద్దిలపాలెం: ఆర్గానిక్ మేళాను ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నామని, దీనిపై అవగాహన కల్పించేందుకు ‘ఆర్గానిక్ నడక’ను మంగళవారం బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్‌స్వామి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరగనున్న ఆరోగ్య నడకను జయప్రదం చేయాలన్నారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆదరించే వారంతా తప్పకుండా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆర్గానిక్ ప్రతినిధులు ఉషా గజపతిరాజు, గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, మేళా ప్రతినిధులు సాయిబాబు పాల్గొన్నారు.

లోకేష్‌కు ఉత్తరాంధ్రలో ప్రవేశించే అర్హత లేదు

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ



నక్కపల్లి: కార్యనిర్వాహక రాజధానిగా విశాఖను వ్యతిరేకించిన టీడీపీ నేత నారా లోకేష్‌కు ఉత్తరాంధ్రలో పాదయాత్ర చేయడానికి సిగ్గులేదా? ఏ ముఖం పెట్టుకుని విశాఖ జిల్లాలో అడుగుపెడుతున్నారని రాష్ట్ర ఎస్సీ(మాల) కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ ఆక్షేపించారు. సోమవారం ఆమె అడ్డురోడ్డులోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ముందు ఉత్తరాంధ్ర ప్రజలకు లోకేష్ క్షమాపణ చెప్పిన తర్వాత పాదయాత్ర ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న లోకేష్‌కు స్వాగతం పలకడానికి వెళ్లిన ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులకు సిగ్గులేదన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రమంతా అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆలోచిస్తుంటే, టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోకేష్ చేసేది పాదయాత్ర కాదని, కేవలం ఉప్పులేని పప్పు మాదిరిగా తయారయిందని ఎద్దేవా చేశారు. ప్రారంభంలో ప్రకటించిన పాదయాత్రకు ఇప్పుడు చేస్తున్న యాత్రకు సంబంధం లేదన్నారు. యాత్రను కుదించుకుని తొందరగా ముగించేస్తున్నారని విమర్శించారు. ఎక్కడ ఇడ్లీలు బొండాలు బాగుంటాయో తెలుసుకుని ఆ ప్రాంతంలో పాదయాత్ర ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఎన్ని యాత్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో నీ బాబు, నువ్వు ఓడిపోవడం ఖాయమన్నారు.

ఘనంగా ఐఎన్ఏఎస్ 333 వార్షికోత్సవం

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్(ఐఎన్ఏఎస్) 333 ఈగల్స్ 43వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ హెలికాప్టర్ 1980లో ఇండియన్ నేవీలో చేరింది. 2000 సంవత్సరం నుంచి విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాలో సేవలందిస్తోంది. ఐఎన్ఏఎస్ 333 నేవీలో చేరి 43 ఏళ్లు అయిన సందర్భంగా ఐఎన్ఎస్ డేగాలో నేవీ అధికారులు కేక్ కట్ చేశారు. అనంతరం హెలికాప్టర్ పనిచేసే విధానాన్ని వివరించారు.


ఈగల్ హెలికాప్టర్